క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిక



కొత్తకోట రూరల్: మండలంలోని రాయిణిపేటకు చెందిన 50మంది బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్‌లో పార్టీలో చేరుతున్న వారికి దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన వారు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. త్వరలో జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి కార్యకర్త పనిచేయాలని కోరారు. పనిచేసే వారికి పార్టీలో గుర్తింపు తప్పకుండా లభిస్తుందన్నారు.

దళారులను ఆశ్రయించొద్దు



కొత్తకోట రూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ సీఈఓ బాలరాజు అన్నారు. మండలంలోని వడ్డెవాటలో మంగళవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీఈఓ బాలరాజు స్థానిక రైతులతో కలిసి ప్రారంభించారు. రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయిస్తే నష్టపోతారని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే వారంలో రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో భానుప్రకాశ్, నారాయణ, భీమన్న, యుగంధర్, భాస్కర్, నక్క రాములు, బాల్‌రాం, ఉదయ్‌కుమార్ ఉమేష్ చారి, నర్సింహ, బాలస్వామి ఉన్నారు.

నర్సరీలో మొక్కలకు నీడ కరువు



అమరచింత: మున్సిపల్ కార్యాలయ ఆవరణంలోని ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన నర్సరీ మొక్కలకు నీడ కరువైంది. వేసవి ఎండలు రోజురోజుకూ ముదురుతున్న సమయంలో మొక్కలు ఎండ తీవ్రతకు వాడుముఖం పడుతున్నాయి. రోజు వారిగా నీటిని ఉదయం, సాయంత్రం అందిస్తున్నా నర్సరీకి గ్రీన్ టెంట్ లేని కారణంగా మొక్కలు ఎండిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నర్సరీకి శాశ్వత నీడ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చిన్నంబావి: మండలంలోని పెద్దదగడకు చెందిన కనమోనొ నరసింహ ఇటీవల అనారోగ్యానికి గురై మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఆయన మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇంటి పెద్దదిక్కును కోల్పోవడం బాధాకరమని కుటుంబ సభ్యులకు అన్ని విధాల అండగా ఉంటామని, అధైర్యపడొద్దని భరోసానిచ్చారు. ఈ విషయాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు తనయుడు జూపల్లి అరుణ్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించి వెంటనే రూ.పది వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో బొల్లు కురుమయ్య, కొమ్మ శ్రీను, వెంకటేష్, రజినిబాబు, నరేష్‌కుమార్, యుగంధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ

అమరచింత: పట్టణంలోని మాల కాలనీలో మంగళవారం చెన్నకేశవస్వామి ఆలయ నిర్మాణం కోసం భూమిపూజ కార్యక్రమాన్ని మాల జన సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ 1977లో మాలల కోసం మఠం బావి సేట్ నుంచి ప్రభుత్వం ఎకరా 20 గుంటల భూమిని కొనుగోలు చేసి 23 మందికి ఇంటి స్థలాలకు కేటాయించారన్నారు. మిగిలిన పది శాతం భూమిలో బడి, గుడి నిర్మాణం కోసం అప్పట్లో స్థలాన్ని ఖాళీగా ఉంచారని తెలిపారు. ప్రస్తుతం ఖాళీ స్థలాన్ని కొంత మంది కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తుడడంతో తమ స్థలాన్ని కాపాడుకునేందుకు ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో వెంకట్రాములు, వెంకటస్వామి, రామస్వామి, శేఖర్, రమేష్, సూరి, ప్రశాంత్, నరేష్, శ్రీనివాసులు, వరలక్ష్మి, పద్మ, కళావతి, లత, వనజ తదితరులు పాల్గొన్నారు.





కొత్తకోటలోని కోదండరామస్వామి ఆలయంలో..



ఆత్మకూర్‌లో పంచాంగ శ్రవణంలో పండితులు



కొన్నూరు తండాలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో ఉగాది వేడుకలు



గట్టుకాడిపల్లిలో వేంకటేశ్వరస్వామి పల్లకీ సేవ



ఖిల్లాఘనపురం కుమ్మరిగేరి ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఎద్దుల బండ్ల ఊరేగింపు

ఆత్మకూర్: మున్సిపాలిటీతో పాటు మండలంలోని గ్రామాల్లో ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. తెలుగు నామ క్రోధికృత నామ సంవత్సరం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణాన్ని పండితులు వినిపించారు. కార్యక్రమంలో ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, చైర్‌పర్సన్ గాయత్రిరవియాదవ్, కౌన్సిలర్లు అశ్విన్‌కుమార్, మహేశ్వరి, యాదమ్మ, మండ్ల రామకృష్ణ, చెన్నయ్య, పోషన్న, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: క్రోధి నామ సంవత్సరంలో అంతా శుభమే జరుగుతుందని పంచాంగ శ్రవణంలో పండితులు ప్రవచించారు. నూతన సంవత్సరాన్ని స్వాగతం పలుకుతూ పట్టణ కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఉగాది పర్వదిన వేడుకలను ప్రజలు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పట్టణ కేంద్రంలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో..

మండలంలోని కానాయపల్లి శివారులో గల శ్రీదత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో ఉగాది వేడుకలను ఆలయ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయంలో శివలింగానికి భక్తులు పూజలు చేస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదానం చేశారు.

పాన్‌గల్: నూతన సంవత్సరాది ఉగాది వేడుకలను మంగళవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా ఇంటి ముంగిళ్లను పచ్చని మామిడి ఆకుల తోరణాలు, పూలతో అందంగా అలంకరించారు. ప్రత్యేకంగా పిండి వంటలు తయారు చేసి దేవుడికి నైవేద్యం సమర్పిస్తారు. క్రోధి నామ సంవత్సరం ప్రారంభంతో ఖరీఫ్ సీజన్‌కు రైతులు నాంది పలుకడం ఆనవాయితీ. కేతేపల్లిలో పూజారి విజయ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు.

వీపనగండ్ల: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ప్రజలు ఉగాది పండుగను వైభవంగా జరుపుకొన్నారు. ఆలయాల్లో మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో ఓరిగంటి రామశర్మ పంచాంగ పఠనాన్ని చదివి వినిపించారు.

ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే

మదనాపురం: మండలంలోని కొన్నూరు పెద్దతండా ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గురుస్వామి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఉగాది పంచాంగం వినిపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగన్న, నాయకులు నారాయణరెడ్డి, జగదీశ్, వెంకటేశ్‌నాయక్, నారాయణ, రవినాయక్, కిషన్ నాయక్, పాండ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: మండలంలోని ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయ ఆవరణంలో పూజారి జంగం జగదీశ్వర్ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ హాజరైయ్యారు. పంటలు బాగా పండుతాయని సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని పూజారులు తెలిపారు.

వేంకటేశ్వర స్వామి పల్లకీ సేవ

ఖిల్లాఘనపురం: మండలంలో మంగళవారం ఉగాది పండుగను ప్రజలు ఆనందోత్సహాల మధ్య నిర్వహించారు. క్రోధినామ సంవత్సరం (ఉగాది) సందర్భంగా గ్రామాల్లో ఉదయం నుంచి సందడి నెలకొంది. ప్రతి ఒక్కరూ ప్రత్యేకంగా బక్షాలు తయారు చేసి ఇంటి దేవతలకు నైవేద్యంగా పెట్టుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గట్టుకాడిపల్లిలో వేంకటేశ్వరస్వామికి పల్లకీ సేవ చేశారు. ఖిల్లాఘనపురం కుమ్మరి గేరి అంజనేయస్వామి, మల్కిమియాన్‌పల్లి అంజనేయస్వామి తదితర ఆలయాల్లో ఎద్దుల బండ్లు, ట్రాక్టర్ల ఊరేగింపు నిర్వహించారు. ఖిల్లాఘనపురంలో 'ఖిల్లా ఫ్రెండ్స్' అసోసియేషన్‌తో పాటుగా పలు గ్రామాల్లో పండుగ సందర్భంగా ఆలయాల వద్ద ఉగాది పచ్చడిని ప్రజలకు పంపిణీ చేశారు. రైతులు తమ కాడెద్దులకు చెరువుల్లో ఈత కొట్టించి కుటుంబ సభ్యులతో పాటుగా బక్షాలు పెట్టి పూజలు చేశారు. ఖిల్లాఘనపురం గోపాలస్వామి ఆలయం, గట్టుకాడిపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంతో పాటుగా పలుగ్రామాల్లో పండితులు పంచాంగ శ్రవణం నిర్వహించారు.



కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో..



వీపనగండ్ల చెన్నకేశవస్వామి ఆలయంలో..



కేతేపల్లిలో పంచాంగ శ్రవణం



ఖిల్లాఘనపురంలో పంచాంగ శ్రవణం



అమరచింతలో..

బీజేపీ బలోపేతానికి కృషి



ఎంపికపత్రం అందుకుంటున్న బుచ్చిబాబుగౌడ్

ఖిల్లాఘనపురం: బీజేపీ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని మండల బీజేపీ కన్వీనర్ బుచ్చిబాబుగౌడ్ అన్నారు. బుచ్చిబాబు గౌడ్‌ను మండల కన్వీనర్‌గా నియమిస్తూ మంగళవారం జిల్లా అధ్యక్షుడు నారాయణ నియామకపత్రం అందించారు. 30 ఏళ్లుగా బీజేపీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసిన బుచ్చిబాబును మండల కన్వీనర్‌గా ఎంపిక చేయడంపై పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీని మూడోసారి ప్రధాన మంత్రిగా చూడాలన్నదే తన ధ్యేయం అన్నారు. అట్టడుగు నుంచి పార్టీలో పనిచేస్తున్న తనకు ఈ బాధ్యతలు ఇచ్చిన జిల్లా అధ్యక్షుడు నారాయణకు, సహకరించిన ప్రతి నాయకుడికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాసులుగౌడ్, ఓబీసీ రాష్ట్ర ప్రతినిధి శ్రీశైలం, జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మోహన్‌గౌడ్, మండల అధ్యక్షుడు నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

ఎర్రవల్లిచౌరస్తా: వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఎర్రవల్లి మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం మేరకు.. ఎర్రవల్లి గ్రామానికి చెందిన పూల మధుకు కొంత కాలం నుంచి మతి స్థిమితం సక్రమంగా లేదు. ఈ క్రమంలో ఈ నెల 6వ తేదీ రోజు ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయాడు. చుట్టు పక్కల ప్రాంతాలతో పాటు బంధువుల వద్ద ఆరా తీయగా ఎలాంటి ఆచూకీ లభించలేదు. ఈ వ్యక్తి ఎవరికైనా కనిపించినా లేదా ఆచూకీ తెలిసినా 8499812689, 6301304558 ఫోన్ నెంబర్లకు కాల్ చేసి సమాచారం అందిచాలని వారు పేర్కొన్నారు.

అలరించిన రెండు బండ్ల గిరక పోటీలు



అమరచింతలో రెండు గిరకల బండి లాగుడు పోటీలో ఎడ్ల బండ్లు

అమరచింత: పట్టణంలోని రాంనగర్‌లో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని రెండు బండ్ల గిరక లాగుడు పోటీలను నిర్వహించారు. రాంనగర్ కాలనీకి చెందిన రైతులే కాకుండ పట్టణంలోని రైతులు తమ ఎడ్ల బండ్లతో పోటీల్లో పాల్గొన్నారు. రసవత్తరంగా జరిగిన రెండు గిరక బండి లాగు పోటీలో కొంకనోనిపల్లి వెంకటన్నకు చెందిన ఎద్దులు మొదటి బహుమతిని గెలుచుకున్నాయి. రెండో బహుమతిని తోకలి సత్యనారాయణ, మూడో బహుమతిని బోగిమి రాజన్న ఎద్దులు కై వసం చేసుకున్నాయి. మొదటి బహుమతి విజేతకు వెండి కడియాన్ని బహుమతిగా బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు అందించగా.. మిగిలిన ఎద్దులకు గజ్జెలు బహుకరించి సన్మానించారు.

ఆత్మకూర్: ఎద్దుల బండ్ల గిరక లాగుడు పోటీలను మండలంలోని పిన్నంచర్లలో వైభవంగా నిర్వహించారు. గిరక పోటీల్లో 16 జతలు పాల్గొనగా అత్యంత ప్రతిభకనబర్చిన ఎడ్ల జత రైతుకు మాజీసర్పంచ్ విజయలక్ష్మిమచ్చేందర్ ఐదు తులాల వెండిని బహుమతిగా అందజేశారు. అలాగే రెండో బహుమతిగా మూడు తులాల వెండిని మల్లేష్‌గౌడ్ అందించారు. అంతకంటే ముందు గ్రామంలో మేళతాలలతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో మాసన్న, ఖాజన్న, హరీష్‌గౌడ్, న్యాయవాది అశోక్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



పిన్నంచర్లలో..

బడుల బలోపేతమే లక్ష్యం



జమ్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సమావేశం (ఫైల్)

- అమ్మ ఆదర్శ కమిటీలతో ప్రయోజనం
- మహిళా సమాఖ్యల భాగస్వామ్యంతో ఏర్పాటు
- పాఠశాలల్లో సమకూరనున్న మౌలిక వసతులు

మండలాల వారీగా

మండలం	పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
పాన్‌గల్	50	3,603
చిన్నంబావి	30	1,718
వీపనగండ్ల	26	1,633



తెల్లరాళ్లపల్లి పాఠశాలలో ఏర్పాటైన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ (ఫైల్)

పాన్‌గల్: రాష్ట్ర ప్రభుత్వం సర్కార్ బడుల్లో నాణ్యమైన విద్యతో పాటు మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించింది. దీంట్లో భాగంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేస్తుంది. వీటిల్లో మహిళా సమాఖ్యలను భాగం చేస్తున్నారు. గత పాఠశాల యాజమాన్య కమిటీల స్థానంలోనే పూర్తిగా మహిళా సంఘాల సభ్యులతో కమిటీలను వేస్తున్నారు.

మండల పరిస్థితి

మండలంలోని 28 పంచాయతీల పరిధిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, కస్తూర్బా పాఠశాలలు కలిపి మొత్తం 50 ఉన్నాయి. పాఠశాల యాజమాన్య కమిటీల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం జనవరి 18న కొత్త కమిటీల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసింది. పాత కమిటీలు రద్దు చేయడంతో నాలుగు నెలలుగా నిర్వహణ ఖర్చులు, మన ఊరు మన బడి బిల్లులు తదితర వాటి కోసం ప్రధానోపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా ప్రభుత్వ నిర్ణయంతో ఈ సమస్య తీరనుంది. ఈ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీకి ఆయా పాఠశాల పరిధిలోని సంఘం సభ్యుల్లో ఒకరు చైర్‌పర్సన్‌గా, ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా, తరగతికి ముగ్గురు తల్లుల చొప్పున సభ్యులుగా ఉంటారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో నూతన కమిటీలు ఏర్పాటు పూర్తి చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

కమిటీల విధులు..

పాఠశాలల్లో నాణ్యమైన విద్య, భోజనం, వసతుల మెరుగుకు కృషి చేయాలి. విద్యుత్, మరుగుదొడ్లు, సురక్షితమైన తాగునీటి సౌకర్యం ఉండేలా చూసుకోవాలి. పాఠశాల భవనాలు, మూత్రశాలలు శిథిలమైతే మరమ్మతు చేయించాలి. ప్రాంగణంలో పారిశుద్ధ్య నిర్వహణ జరిగేలా చూడాలి. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోగా స్కూల్ డ్రస్సులు కుట్టించాల్సిన బాధ్యతను కమిటీలకు అప్పగించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థుల ప్రగతి, ఆరోగ్య పరీక్షలు తదితర అవసరాలను కమిటీలు బాధ్యత వహించాలి.

సమన్వయంతో పనిచేస్తాం



ప్రభుత్వం నూతనంగా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన అమ్మ ఆదర్శ కమిటీలతో మాకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహిస్తూ బడుల బలోపేతానికి తమ వంతు కృషి చేస్తాం. కమిటీ సభ్యులందరం సమన్వయంతో పనిచేస్తూ పాఠశాలల్లో చేపట్టే అభివృద్ధి పనులు పూర్తి చేసేలా చూస్తాం.

– ఇందిరమ్మ, కమిటీ చైర్‌పర్సన్, తెల్లరాళ్లపల్లి

అక్షరాస్యత పెంచేందుకు..



ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన అమ్మ ఆదర్శ కమిటీల్లో విద్యార్థుల తల్లులు సభ్యులుగా ఉండటంతో విద్యార్థులు రెగ్యూలర్‌గా బడులకు వచ్చేలా చేయడం మూలంగా అక్షరాస్యత పెరుగుతుంది. పిల్లల చదువు పురోగతిని పరిశీలించడంతో పాటు పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం అవుతాయి.

– అలివేలు, హెచ్‌ఎం, పీఎస్, పాన్‌గల్

కమిటీల ఏర్పాటు పూర్తి చేశాం



ప్రభుత్వం అన్ని ప్రభుత్వ బడుల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను వేయాలని ఉత్తర్వులు జారీ చేయడంతో అన్ని పాఠశాలల్లో కమిటీలను పూర్తి చేశాం. ఆ కమిటీల మేరకు చైర్‌పర్సన్, కన్వీనర్ సంయుక్తంగా బ్యాంకు ఖాతాలను కూడా తీసేలా చర్యలు తీసుకున్నాం. అక్కడక్కడ మిగిలిపోయిన బ్యాంకు ఖాతాలను ఒకటి, రెండు రోజుల్లో పూర్తి చేస్తాం.

– లక్ష్మణ్‌నాయక్, ఎంఈఓ, పాన్‌గల్

క్రీడలతో మానసికోల్లాసం

కొత్తకోట రూరల్: క్రీడలతోనే మానసికోల్లాసం వస్తుందని మాజీ ఎంపీపీ మన్నెపురెడ్డి అన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లిలో మంగళవారం పీపీఎల్ 4 క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో విన్నర్ టీంకు రూ.పది వేలు అందిస్తానని తెలిపారు. అదేవిధంగా గ్రామానికి చెందిన మన్నె రాజవర్ధన్‌రెడ్డి రన్నర్ టీంకు రూ.5వేలు ప్రకటించారు. ఈ పోటీల్లో మొత్తం పది జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు యాదగిరిగౌడ్, బీరయ్య, ఆసిఫ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు స్నేహభావంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు సిద్ధయ్య, తిక్కన్న, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ లక్ష్మణ్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కల్వరాలలో..

వీపనగండ్ల: గ్రామాల్లోని యువకులు క్రీడాస్ఫూర్తిని అలవర్చుకున్నప్పుడే మంచి గుర్తింపు తెచ్చుకుంటారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కల్వరాల నర్సింహ అన్నారు. మంగళవారం గ్రామంలో ఆయన క్రికెట్ పోటీలను ప్రారంభించాడు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.



పామిరెడ్డిపల్లిలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు